పింఛన్...పంచెన్..!

- అవ్వాతాతలకు చేరిన సొమ్ము
- జిల్లాలో 95.49 శాతం పూర్తి
- రాష్ట్రంలోనే చిత్తూరుకు మొదటిస్థానం
- ఇంకా 12,330మందికి పెండింగ్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల ముందు సామాజిక పింఛన్ దారులను తమకు అనుకూలంగా మలుచుకొనే క్రమంలో అధికార, ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో అగ్గిరాజేశాయి. దొందూ దొందే అన్నట్లుగా వ్యవహరించాయి. వలంటీర్లను ఎన్నికలు ముగిసే వరకూ పక్కనపెట్టాలని ఈసీ ఆదేశించింది. దీంతో ప్రతి నెలా ఇచ్చే పింఛన్ సొమ్మును అధికారులతో ఇప్పించాలని సూచించింది. ప్రతి నెలా 31తేదీ సాయంత్రానికి ఖాతాలో జమౌతున్న సొమ్ము ఈ నెల 2తేదీ ప్రభుత్వం జమచేసింది. ఆ తరువాత అధికారులు పింఛన్ పంపిణీ మొదటుపెట్టారు. పంపిణీ సాగుతుండగానే వలంటీర్లు లేకపోవడంతో పింఛన్ పంపిణీ ఆలస్యమైందని, వలంటీర్ల వ్యవస్థను ప్రతిపక్షాలు అడ్డుకోవడంతోనే ఇలా జరిగిందని అధికారపక్షం ప్రధానంగా ఆరోపించింది. పింఛన్ దారులకు సొమ్ము అందించేందుకు సరిపడా సిబ్బంది ఉన్నా కావాలనే ప్రభుత్వం సొమ్ము ఆలస్యంగా జమచేసిందని ప్రతిపక్షాలు ప్రతివిమర్శలు చేశారు. ఇరు పక్షాలు ఒకరిపైఒకరు విమర్శలకు దిగారు. అంతలోనే కొన్నచోట్ల వలంటీర్ల రాజీనామాలు చేయడం జరుగుతుండడంతో వలంటీర్లకు వ్యతిరేకంగా కాదని ప్రతిపక్షాలు అనడం. ప్రస్తుతం ఉన్న దానికంటే పెంచి రూ.4వేలు ఇస్తానని చంద్రబాబు ప్రకటించారు. తొలిసంతకం వలంటీర్ల నియామకంపై ఉంటుందని సీఎం ప్రకటించారు. ఈ తతంగమంతా జరుతుండగా ప్రతి నెలా 1న అందే పింఛన్ ఆలస్యం కావడంతో అవ్వాతాతలు ఒకింత ఆందోళన, నిరాస, అసహనానికి లోనైయ్యారు.

ప్రతిష్టాత్మకంగా పింఛన్ పంపిణీ..

వలంటీర్ల ప్రమేయం లేకుండా సామాజిక పింఛన్ దారులకు సొమ్మును అందజేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నారు. జిల్లాలో 612సచివాలయాలు ఉండగా అందులో 8నుంచి 11మంది సిబ్బంది చొప్పున మొత్తం 8800మంది విధుల్లో ఉన్నారు. వీరి పరిధిలో 400నుంచి 450మంది పింఛన్ దారులు ఉన్నారు. జిల్లాలో మొత్తం 273304మంది లబ్ధిదారులకు అందించేందుకు ప్రణాళికా బద్ధంగా అధికారులు చొరవతో 3, 4, 5తేదీల్లో 260974మందికి అందించి రాష్ట్రంలోనే 95.49శాతం పంపిణీ చేసి చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలించింది. 12330మందికి పింఛన్ ఇవ్వాల్సి ఉండగా శనివారం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

పింఛన్ పంపిణీని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒడిదుడుకుల మధ్య పంపిణీ..

వలంటీర్లు ప్రమేయం లేకుండా సిబ్బంది ద్వారా పంపిణీ చేపట్టాలని ఈసీ ఆదేశించడంతో సిబ్బంది కాస్త ఒడిదుడుకులు పడ్డారు. ఆలస్యంగా 2వ తేదీ ఖాతాల్లో సొమ్ము జమకావడం, ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు 3వ తేదీ సొమ్ము డ్రా చేసేందుకు సమయం పట్టడం వంటి ఇబ్బందులు పడ్డారు. ఆ తరువాత పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన సిబ్బంది తొలిరోజు 3వే తేదీ సాయంత్రానికి 273304మందికి గానూ 157071మందికి ఇచ్చి 59.47శాతం పూర్తి చేశారు. 4న ఆ సంఖ్య 24055కు చేరుకొని 88.02శాతం పూర్తైంది. 5వ తేదీ సాయంత్రానికి 260974మందికి సొమ్మును అందజేయడంతో జిల్లాలో 95.49శాతం పంపిణీ పూర్తైంది. జిల్లాలో నగరి మున్సిపాలిటీ పరిధిలో 98.66శాతం పూర్తై మొదటి స్థానంలో ఉండగా చిత్తూరు నగరపాలక పరిధిలో 98.41శాతంతో రెండవ స్థానంలో నిలిచింది.

ఉక్కిరిబిక్కిరి..

వలంటీర్లు రానందున పింఛన్ పంపిణీకి ఇబ్బంది పడిందని ఒకరు, కాదు సొమ్ము ఖాతాల్లో జమకాలేదని ఇంకొకరు అంటుండడంతో సామాజిక పింఛన్ దారులు ఒకింత ఆందోళనకు గురైయ్యారు. ఆలస్యంగా పంపిణీ మొదలు కావడంతో సచివాలయాల వద్దకు చేరుకొని అక్కడ ఎండ తాపానికి ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ తతంగమంతా జరుగుతుండగానే అధికార పార్టీ నేతలు కొన్నిచోట్ల అత్యుత్సాహం ప్రదర్శించింది. వృద్ధులను మంచాలు, కుర్చీల్లో తీసుకురావడం వంటివి చేపట్టే సానుభూతికోసం ప్రయత్నించింది. ప్రతిపక్ష పార్టీలు ప్రెస్‌మీట్‌లు పెట్టి విమర్శనాస్త్రాలు గుప్పించారు. కొంతమంది నిరసించి పడిపోగా, ఒకటి రెండు చోట్ల నీరసించి వృద్ధులు మృతి చెందారు. ఆలస్యంగానైనా పింఛన్ అందడంతో అవ్వాతాతలు హమ్మయ్యా అంటూ ఆనందించారు.

33విభాగాలకు పోస్టల్ బ్యాలెట్

- నిత్యావసర సేవలందించే వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నిత్యావసర సేవలందిస్తున్న 33విభాగాలకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో విధుల్లో ఉంటూ పోలింగ్ రోజున ఓటు వేయాలని 33శాఖలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని తెలిపారు. త్వరలో రాష్ట్రంలో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అర్హతవున్న విభాగాల వివరాలను వెల్లడించింది. ఇందు కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతో పాటు పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి ఫారం-12డి లను అందుబాటులో ఉంచాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొందన్నారు. ఇందుకోసం జిల్లాలో ఒక నోడల్ అధికారిని కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ అవకాశం వీరికే..

మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు రవాణా) సేవలు, మీడియా వ్యక్తులు, బీఎస్ఎన్ఎల్, విద్యుత్ శాఖ, పోస్టల్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో-ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్మెంట్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైళ్లు, ఎక్సైజ్ శాఖ, వాటర్ ఆథారిటీ, ట్రెజరీ సర్వీస్, అటవీశాఖ, సమాచార, ప్రజాసంబంధాల శాఖ పోలీసు, పౌర రక్షణ-హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు-వినియోగదారుల వ్యవహారాలు, ఎనర్జీ(పవర్), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్ట్మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడి, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణ శాఖలకు అవకాశం ఉంది.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ: ఎస్పీ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహించడమే ప్రధాన ధ్యేయం అని నూతన చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన చిత్తూరు 67వ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా శాంతియూత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే ఒదుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని, సరి హద్దుల్లో పటిష్ట నిఘా ఉంచుతామన్నారు. పౌరులం దరూ స్వేచ్ఛగా ఓటు వినియోగించుకొనేలా కృషి చేస్తానన్నారు. ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెరిగేలా చర్యలు ఉంటాయన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా ప్రణాళికా బద్ధంగా పనిచేస్తామన్నారు.

ఉద్యోగులకు వృత్తి నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జూ పార్కు మార్గంలో గల స్టేట్ ఇన్స్ స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ లో తిరుపతి నగర పరిధిలోని కౌటిల్య ఇన్స్ స్టిట్యూట్ వారిచే ఉద్యోగులకు రెండు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటిల్య ఇన్స్ స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్, ఎస్ ఎస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులలో ముఖ్యంగా జవాబుదారీతనంతో పని చేయడానికి అవసరమైన వాతావరణాన్ని ఉద్యోగ ప్రదేశాల్లో తోటి ఉద్యోగులతో ఎలా మెలగాలి, నాయకత్వ పెంపు, టీం వర్క్, డిజిటల్ నైపుణ్యత, ఆతిథ్యం, వృత్తి నైపుణ్యం వంటి అంశాలు చాలా కీలకమైనవి అన్నారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యత పట్ల కచ్చితత్వంతో వ్యవహరిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్ మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కాలేజీ మరింత అభివద్ధి చెయ్యడానికి, తమ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. సంస్థ అభివద్ధిలో ఉద్యోగుల భాగస్వామ్యం చాలా కీలకమైనదని, భాగస్వామ్య పటిష్టతకు తీసుకోవలసిన మెలుకువలను పాటిస్తున్నామన్నారు.

సాంకేతిక స్వావలంబనతో 'ఆత్మ నిర్భర్ భారత్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శాస్త్ర సాంకేతిక రంగాల్లో పూర్తిస్థాయి స్వావలంబన సాధించడం వల్ల ఆత్మ నిర్భర్ భారత్ వైపు అడుగులు వేయచ్చని రక్షణ పరిశోధన, వైమానిక శాస్త్ర నిపుణుడు డాక్టర్ జి. సతీష్ రెడ్డి అన్నారు. తిరుపతి ఐఐటీలో 9వ సంస్థ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ సతీష్ రెడ్డి హాజరయ్యారు. తయారీ, గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ వంటి కీలకమైన సాంకేతిక రంగాల్లో పురోగతి అవసరమని ఆయన నొక్కి చెప్పారు. సెన్సార్‌లు, డిటెక్టర్‌లు, లేజర్ డయోడ్‌ల అభివద్ధి జరగాలని పిలుపునిచ్చారు. ఇంకా భారత్ లో కొనసాగుతున్న ఏరోస్పేస్ పరిశోధన, అభివద్ధిపై విద్యార్థులకు వివరించారు. ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీరామలో ముగిసిన 'తరంగ్' వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): విద్యార్థు ల్లో నూతన ఉత్తేజాన్ని, లక్ష్యాలకు అనుగుణంగా ప్రముఖులు ఇచ్చిన సూచనలు, నత్య ప్రదర్శనలతో శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో తరంగ్ 2024 పేరుతో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతోపాటు సాంస్కతిక కార్యక్రమాలు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తాయని, కళాశాలలో అందుబాటులో ఉన్న వనరులను అందిపుచ్చుకొని మంచి లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. రెండవ రోజు కళాశాల విద్యార్థులు భరతనాట్యం, జానపదం, పౌరాణికం, డిస్కో వంటి వివిధ రకాల నత్య ప్రదర్శనలను చేసి అలరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం..

- కళాజాత ద్వారా నగరంలో చైతన్య కార్యక్రమాలు

ఓటు హక్కుపై ప్రచారం చేస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఓటంటే మాట కాదురా.. ప్రగతి బాటరా.. అంటూ డప్పు డోలు వాయిస్తూ కళాజాత బృందం చిత్తూరు నగరంలో ఓటర్లను చైతన్య పరుస్తోంది. నగరపాలక స్వీప్ నోడల్ టీం సభ్యులు నగరంలో వినూత్నరీతిలో ఓటరు చైతన్య ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నగరపాలక పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ కళాజాత బృందం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కళాజాత బృందం నగరంలోని కూడళ్లు, జన సమర్థ ప్రాంతాల్లో ఓటర్ చైతన్యంపై జానపద పాటల ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని ఎన్టీఆర్ బస్టాండ్, బజార్ వీధి, దర్గా సర్కిల్, గిరింపేట కూడలిలో బుర్రకథలు, జానపద పాటల ద్వారా ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన కల్పించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంహెచ్‌వో, స్వీప్ అసిస్టెంట్ నోడల్ అధికారి చిన్నయ్య, స్వీప్ నోడల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంకీర్తనల గోష్టిగానం

ప్రజాశక్తి - తిరుమల

శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతి మహోత్సవాలు టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం ఆకట్టుకుంది.రాజంపేట - కడప హైవేలో ఉన్న 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకూ మణి బృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. తిరుపతికి చెందిన వెంకట కృష్ణయ్య బృందం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టుసంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

భక్తులకు శరణాగతి నేర్పిన అన్నమయ్య : డాక్టర్ రవి కుమార్

భగవంతుని తత్వాన్ని తెలుసుకునేందుకు శరణాగతి తప్ప మరో మార్గం లేదని భక్తులకు అన్నమయ్య తెలియజేశారని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ పేర్కొన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్థంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సాహితీ సదస్సులు ప్రారంభమయ్యాయి. సదస్సుకు అధ్యక్షత వహించిన డాక్టర్ రవి కుమార్ "అన్నమయ్య - యోగ సంకీర్తనలు" అనే అంశంపై ఉపన్యసిస్తూ, ప్రసిద్ధ శ్రీవైష్ణవాచార్యులు భగవద్ రామానుజులు తెలియజేసిన అష్టాక్షరి మంత్రాన్ని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా శ్రీ వైష్ణవ ధర్మాన్ని, భక్తి తత్వాన్ని ప్రచారం చేసినట్టు తెలిపారు. నరసాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త డా.రామారావు 'అన్నమయ్య - భావుకత' అనే అంశంపై ఉపన్యసించారు. తెలుగు అధ్యాపకులు శ్రీరాములు వాగ్గేయకారులు - అన్నమయ్య ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టుసంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

తిరుపతి అసెంబ్లీ సీపీఐ అభ్యర్థిగా పి.మురళి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి అసెంబ్లీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అభ్యర్థిగా తిరుపతి జిల్లా కార్యదర్శి పి మురళి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇండియా కూటమి అభ్యర్థిగా సిపిఎం, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో పి.మురళి తిరుపతి అసెంబ్లీ నుండి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తారని తెలిపారు. మురళి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిగా, ఆటో యూనియన్ రాష్ట్ర నాయకులుగా ఉన్నారు. తిరుపతిలో ఆటో, హాకర్స్, బిల్డింగ్,మెడికల్, మున్సిపల్ కార్మికులతో పాటు వీధి విక్రయదారులు సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. జిల్లాల పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లాకి సిపిఐ నుండి ప్రథమ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. లెనిన్ నగర్, ప్రగతి నగర్, వేదాంతపురం, బర్డన్ కాలనీల నిర్మాణంలో క్రియాశీలక పాత్ర వహించి వందలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపిని, ఆ పార్టీకి కొమ్ము కాస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని, ఇండియా కూటమి అభ్యర్థిగా తనను గెలిపించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మురళి కోరారు. తనను శాసనసభ్యుడిగా గెలిపిస్తే తిరుపతి సమగ్రాభివద్ధికి, కార్మిక పేద ప్రజల గొంతుక అసెంబ్లీలో వినిపిస్తానని తెలిపారు.

'కాంగ్రెస్ ఆదేశిస్తే పోటీకి సై'

నవీన్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అదిస్థానం సంపూర్ణ సహకారంతో అవకాశం ఇస్తే కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని ఆ పార్టీ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో ప్రశాంత వాతావరణం రోజురోజుకూ కనుమరుగై పోతుందన్నారు. రౌడీయిజం, భూకబ్జాలు, అవినీతి అక్రమాలు ఆధ్యాత్మిక నగరంలో వినబడకూడదన్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు అందరం కలసికట్టుగా కష్టపడతామన్నారు. అయితే ఇండియా వేదికలో భాగస్వామి అయిన సిపిఐ తిరుపతి నుంచి బరిలో దిగనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే నవీన్‌కుమార్‌రెడ్డి తాను సైతం బరిలో ఉన్నానని చెప్పడం గమనార్హం.

టిటిడి ఆధ్వర్యంలో తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుమల: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భక్తులందరికీ శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను టిటిడి ఈవో ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం కాల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. టిటిడి ఆధ్వర్యంలో తొలిసారిగా ముద్రించిన తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వచ్చే వారం నుంచి భక్తులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 9న ఉగాది పర్వదినం పురస్కరించుకుని టిటిడి ఆస్థాన పండితులు ఆస్థానం, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, చెన్నయ్, బెంగుళూరులోని టిటిడి సమాచార కేంద్రాల్లోనూ పంచాంగం అందుబాటులో ఉంటుందన్నారు. తిరుపతి పరిపాలనా భవనంలో కాల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. 29 మంది భక్తులు 38 సమస్యలను ఫోన్ ద్వారా ఈవోకు తెలియజేశారు.

ఘనంగా బాబు జగజ్జీవన్‌రామ్ జయంతి

బాబూ జగ్జీవన్ రాంకు నివాళులర్పిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధులు, బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం, జిల్లా ఏఆర్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోల, అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఆరిఫుల్లా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

చిత్తూరుఅర్బన్: సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేసిన సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ అన్నారు. 117వ జయంతి సందర్భంగా ఆ ప్రజా నాయకుడి చిత్ర పటానికి గుడిపాల మండల కేంద్రం వద్ద నివాళులర్పించారు.

పూతలపట్టు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్ రామ్ అని జెడ్పిటిసి దేవిక అన్నారు. శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని పూతలపట్టు మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచి పెట్టుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మునిరత్నం రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవరత్నం, షణ్ముగం, మునిరత్నం, నాగరాజు, జయపాల్, జేఈ మునిరత్నం, సుందర్ రాజ్ పాల్గొన్నారు.

వికోట: స్వాతంత్ర్య సమరయోధుడిగా సంఘ సంస్కర్తగా తన పరిపాలన దక్షతతో యావత్ భారతదేశానికి విశేష సేవలు అందించిన మాజీ ఉపరాష్ట్రపతి అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ 117వ జయంతిని శుక్రవారం ఎమ్మార్పీఎస్, బాస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలిలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ళర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, శంకర్రావు, బాస్ నాయకులు గణపతి, దొరస్వామి, వినోద్, నారాయణ, శివరాం, సంపంగి, జయప్ప, దాము, మురళి, భరత్ పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రావు 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రావ్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి మాట్లాడుతూ 50సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఉప ప్రధానమంత్రిగా స్వాతంత్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వ్యక్తిగా అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచిన ఏకైక ప్రధానమంత్రిగా అణగారిన వర్గాల కోసం ఎన్నో విధాలుగా హరిత విప్లవానికి ఇవన్నీ తెచ్చిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయిన మహనీయుడు బాబు జగ్జీవన్ రావని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మొగిలీశ్వరయ్య, ప్రకాష్, ప్రభుకుమార్, లక్ష్మీపతి, రమణ, శ్రీరాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సమసమాజ స్థాపనకై కృషిచేసిన కృషివల్లుడు బాబు జగ్జీవన్ రామ్ అని విశ్రాంతి ఎంఈఓ చంద్రన్ అన్నారు. శుక్రవారం అరగొండ రోడ్డులో బాబు జగ్జీవన్ రాయి జయంతి ఉత్సవాలు జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హేమచంద్ర, చిన్న దొరై, శ్రీరాములు, సుబ్రహ్మణ్యం, జయపాల్, కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు పురపాలక కార్యాలయంలో డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ 117వ జయంతిని అధికారులు ఘనంగా జరుపుకొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

వెంకటరెడ్డి మృతికి నివాళి



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కల్లుపల్లి పంచాయతీ బూడిదపల్లికు చెందిన వెంకట్‌రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అమరనాథ రెడ్డి బూడిదపల్లికి చేరుకొని వెంకటరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోగులకు అన్నదానం

అన్నదానం చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు పాపిరెడ్డి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం ఎంబి కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎంవి శ్రీధర్ రెడ్డి సాకారంతో అన్నదానం చేపట్టారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులు సరైన సమయానికి ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. ఆరోగ్య కేంద్రానికి దగ్గరలో భోజన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని ఉద్దేశంతో ఎంవీ శ్రీధర్‌రెడ్డి ఆర్థిక సహాయం అందిచారు. మండల రెడ్ క్రాస్ సొసైటీ తోడ్పాటు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు దుర్గాదేవి, ప్రవీణ్, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎన్‌ఆర్‌ఐ

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బంగారుపాళ్యం మండలం పెరుమాళ్ళపల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ దీపారెడ్డి కలిశారు. శుక్రవారం నెల్లూరులో బస్సు యాత్ర చేపడుతున్న సందర్భంలో సీఎంని కలిశారు. ఈమె యూఎస్‌ఏలో వైసీపీ తరపున స్టార్ క్యాంపెనర్గా వ్యవహరిస్తున్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం తమ వంతుగా ప్రచారం సాగిస్తున్నట్లు ఆమె తెలిపారు.

పేదరికాన్ని నిర్మూలిస్తాం: టీడీపీ

ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా టిడిపి పరిపాలన చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టివి రవి, సుబ్రీ, విజయ్ రెడ్డి, రామ కృష్ణప్ప, సలాంసాబ్, సతీష్, అవినాష్, బాలు, అమర్, మంజునాథ్, ఆదిల్ పాల్గొన్నారు.

ఆరు నెలల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తా: గురజాల

ఇంటింటి ప్రచారంలో గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తానని టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన గుడిపాల మండలం మరకాలకుప్పం పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు డ్రైనేజీ కాలువ లు, శ్మశాన వాటికలకు దారి, తదితర మౌలిక సదుపా యాలు కల్పించాలని కోరారు. ఈ విషయంగా ఆయ న స్పందిస్తూ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు. టీడీపీకి ఓటేయాలని అభ్యర్థించారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా: అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-పలమనేరు: స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పలమ నేరు కేంద్రంగా తాను పోటీకి దిగుతున్నట్లు అరుణ్ కుమార్ స్పష్ట ం చేశారు. శుక్రవారం ఆయన పలమనే రులో విలేకరులతో మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగుతున్నట్లు ప్రకటించారు. ఆయన స్వగ్రామం పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లి పంచాయతీ కూరుమాయి. గత కొంతకాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్రంలో బిసిల సంక్షేమం, అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం రామకుప్పంలో జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్, ఇప్పుడు వైసిపి ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూసారే తప్ప వారి బాగోగులను పట్టించుకోలేదన్నారు. సీఎంలుగా ఎన్టీయార్, చంద్రబాబులు బీసీలకు గుర్తింపు ఇచ్చారనీ, బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేలా కృషి చేశారన్నారు. కుప్పం నియోజకవర్గం లోని బీసీలకు చంద్రబాబు ఎంతో మేలు చేశారన్నారు. సమావేశంలో డాక్టర్ సురేష్, మునిరత్నం, ఆనంద్ రెడ్డి, మునస్వామి ,ఆంజనేయ రెడ్డి, పత్రా నారాయణ, చిన్ని కృష్ణ, చలపతి, రామమూర్తి, గంట్లగౌడు, నాగభూషణం, సుబ్రీ, సత్యా, బాలు పాల్గొన్నారు.

మురగేష్‌గౌడ్‌కి సంతాపం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గుడిపాల మండలం రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లి గ్రామానికి చెందిన వయోవద్ధుడు మురుగేష్ గౌడ్ గురువారం వృద్ధాప్య పెన్షన్ కోసం చుక్కావారిపల్లి నుండి రామభద్రాపురం సచివాలయం నడిచి వెళ్లే సందర్భంగా వేసవి తాపానికి తట్టుకోలేక అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ చిత్తూరు అభ్యర్థి గురుజాల జగన్‌మోహన్ శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు గోళ్ళ హేమాద్రి నాయుడు, మాజీ సర్పంచ్ పయణి, మాజీ ఎంపిటీసీ సభ్యులు షణ్ముఖం, నాయకులు వరదరాజుల నాయుడు, గణపతి గౌడ్, గోవింద నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిపై చంద్రబాబుకు ప్రత్యేక విజన్: సీఆర్ రాజన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్రాభివృద్ధిపై చంద్రబాబుకు ప్రత్యేక విజన్ ఉందని టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు సీఆర్ రాజన్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావుతో కలిసి జిల్లాలోని అన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఆర్ రాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు సర్వ నాశనం అయ్యాయన్నారు. బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. గాడిదప్పిన రాష్ట్రాన్ని సక్రమమైన మార్గంలో నలపాలంటే రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక విజన్ ఉన్న చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ, జనసేన నాయకలు పాల్గొన్నారు.

చంద్రగిరిలో వైసిపికి ఎదురు దెబ్బ

ప్రముఖ ద్వితీయ శ్రేణి నాయకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గంలో వైసిపికి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. వెస్ట్ గోదావరి జిల్లా , గోపాలపురం నియోజకవర్గంలో పర్యటనలో వున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో భారీ ఎత్తున చంద్రగిరి వైసిపికి చెందిన ప్రముఖ ద్వితీయశ్రేణి నాయకులు చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తినాని ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. పాకాల మండల జడ్పిటిసి నంగా పద్మజ, ఆమె భర్త వైసిపి సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంగా బాబు, చంద్రగిరి మండలం ఐతేపల్లికి చెందిన సీనియర్ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త రమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్ రెడ్డి, నంగా నితిన్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, విక్కీ, ప్రసన్న టిడిపి కండువాలు కప్పుకున్నారు. గురువారం వైసిపికి రాజీనామా చేసిన పాకాల జెడ్పీటీసీ నంగా పద్మజ, నంగా బాబు రెడ్డి దంపతులు మాట్లాడుతూ కష్టపడిన వారికి వైసీపీలో తగిన గుర్తింపు లేదని, ఎమ్మెల్యే పిఏలు, పిఆర్‌ఓల పెత్తనం ఎక్కువైందని విమర్శించారు. కనీసం ప్రోటోకాల్ కూడా పాటించకుండా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లు గడుస్తున్నా ఒక్క అభివృద్ధి పని చేయలేక పోయామని పార్టీలో ఉత్సవ విగ్రహాల్లా ఉండలేకే వైసీపికి గుడ్ బై చెప్పి టిడిపిలో చేరామన్నారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన పది సంవత్సరాల పదవీకాలంలో నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోక గంజాయి హబ్ గా మార్చారని దోపిడీలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు తప్ప ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కుమారా రాజా రెడ్డి, చంద్రగిరి మండలం పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

ఆర్పేదేలే.!

- రేయీపగలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు
- పట్టించుకోని యంత్రాంగం



పగలుకూడా వెలుగుతున్న విద్యుత్ దీపాలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: రాయీపగలూ వెలగాల్సిందే.. వీధి దీపాలు ఆర్పేదేలే.. అన్నట్లుంది అక్కడి సిబ్బంది తీరు. మండలంలోని దాసర్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వీధి దిపాలు రాత్రింబవళ్ల వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ ఆదా చేయాలని పదేపదే ఉన్నతాధికారులు చెబుతున్నా సిబ్బంది మాత్రం ఖాతరు చేయడం లేదు. అందుకు నిలువెత్తు సాక్ష్యం అక్కడ నిరంతరం వెలుగుతున్న విద్యుత్ దీపాలు. ఇప్పటికైనా స్థానిక సిబ్బంది స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏపీఆర్‌సెట్ ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏపీ ఆర్ సెట్ 2023-24 ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినట్లు కన్వీనర్ ఆచార్య బి.దేవప్రసాద్ రాజు శుక్రవారం వెల్లడించారు. మే 2 వ తేదీ నుంచి 5 వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకూ రెండు దశలుగా పరీక్షలు వుంటాయని తెలిపారు. ఈ నెల 10 వ తేదీ నుంచి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వెబ్ సైట్ నుంచీ హాల్ టికెట్లు పొందవచ్చని సూచించారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన 14 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 10 వేల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉన్నట్టు ప్రొఫెసర్ దేవప్రసాదరాజు వివరించారు. విద్యార్థులు సకాలంలో హాల్‌టికెట్లు తీసుకుని పరీక్షా కేంద్రానికి చేరుకుని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు.

జగన్ ప్రభుత్వ హయాంలో బిసిలకు అన్యాయం

- చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జగన్ ప్రభుత్వ హయాంలో బిసిలకు తీరని అన్యాయం ఎదురైందని చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి పేర్కొన్నారు. నగరి నియోజకవర్గం, క్లస్టర్ 4 బీసీ మహాసభ పుత్తూరు మండల టిడిపి కార్యాలయంలో పుత్తూరు పట్టణ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలు దగాకు గురయ్యారన్నారు. బీసీలను ఎన్టీఆర్, చంద్రబాబు కుటుంబ సభ్యులుగా చూస్తే జగన్ రెడ్డి బానిసలుగా చూస్తున్నాడని విమర్శించారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు ప్రసంగించారు. ఈ సమావేశంలో టిడిపి పుత్తూరు పట్టణ పార్టీ ప్రధానకార్యదర్శి ఎన్‌ఎన్ ధనపాల్, పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ బిఆర్‌యుగంధర్, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

- అడ్డుకున్న టిడిపి నాయకురాలు, గ్రామస్తులు,
- అభివృద్ధికి ఐక్య పోరాటానికి సిద్ధమన్న సుష్మారెడ్డి

మట్టిని అడ్డుకుంటున్న టిడిపి నాయకురాలు సుష్మారెడ్డి, గ్రామస్తులు

ప్రజాశక్తి -కోట: కోట మండలంలోని తిన్నెలపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకన్నపాలెం నుండి తిన్నెలపూడి గ్రామానికి వెళ్లే సీసీ రోడ్డు పక్కనే మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. శుక్రవారం వెంకన్నపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో తొలగిస్తున్న సమాచారం సీనియర్ టిడిపి నాయకురాలు గండవరం సుష్మా రెడ్డి, సుధీర్ రెడ్డి తెలసుకున్నారు. వెంటనే తిన్నెలపూడి గ్రామస్థులతో కలిసి వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు పక్కనే మట్టిని తొలగిస్తున్న వెంకన్నపాలెం గ్రామానికి చెందిన ఆ వ్యక్తిని నిలదీశారు. మట్టి తీసుకెళుతున్న ఆ వ్యక్తి తాను తప్పు చేయలేదని ఘర్షణకు దిగాడు. ఆగ్రహించిన తిన్నెలపూడి గ్రామస్తులు ఆ మట్టిని రోడ్డుకి అడ్డంగా పోసివేసి అడ్డుకున్నారు. జేసీబీ సాయంతో మట్టిని ఎక్కువగా తొలగించడంతో పక్కనే వున్న విద్యుత్ స్తంభాలు కూలి పోయే ప్రమాదంలో వున్నాయని గ్రామస్థులు వాపో యారు. ఈ సందర్భంగా సుష్మా రెడ్డి మాటా ్లడుతూ పార్టీలకు అతీతంగా తిన్నెలపూడి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సంఘటన గ్రామ సమస్య కావడంతో పరిష్కరించడానికి వెంటనే తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు. వెంకన్నపాలెం నుండి తిన్నెలపూడి గ్రామానికి వెళ్లడానికి రోడ్డును గతంలో తమ తండ్రి గండవరం రవీంద్రా రెడ్డి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గండవరం సుష్మా రెడ్డి, సుధీర్ రెడ్డి, తిన్నెలపూడి గ్రామస్థులు పాల్గొన్నారు.

'హిమజ'లో రోబోటిక్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం

రోబోటిక్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సురేంద్రరాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పరిధిలోని ప్రముఖ విద్యా సంస్థ హిమజ పాఠశాలలో టింకరింగ్ రోబోటిక్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి రీజినల్ సైన్స్ కో ఆర్డినేటర్ కోలా శ్రీనివాస నెహ్రూ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా హిమజ పాఠశాల ఛైర్మన్ సురేంద్ర రాజు అతనికి శాలువాతో జ్ఞాపికను అందజేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పిల్లలు వివిధ రకాలుగా తయారు చేసిన రోబోటిక్ యంత్రాలు, గాలిలో ఎగిరే విమానాలు, బ్యాటరీ సెల్‌తో నడిచే చిన్నచిన్న రోబోటిక్ యంత్రాలు 3డి ప్రింటర్ సాయంతో డిజైన్ చేసుకునే కళాకృతులు, గాలిలో ఎగిరే డ్రోన్‌లు అక్కడికి విచ్చేసిన వారిని ఎంతో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వారు తయారుచేసిన వాటి వివరాలను చక్కగా వివరిస్తుంటే అతను ఆసక్తిగా తిలకించారు. తర్వాత నెహ్రూ మాట్లాడుతూ హిమజా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడం తనకు చాలా సంతోషకరంగా వుందన్నారు. పిల్లల భవిష్యత్తు పట్ల సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొం దించడంలో హిమజ పాఠశాల అన్నిట్లో ముందంజలో ఉం టుం దన్నారు. పాఠశాల ఛైర్మన్ సురేంద్ర రాజు మాట్లాడుతూ జిల్లాలోని మన పాఠశాలలో మాత్రం ప్రత్యేకంగా రోబోటిక్ ల్యాబ్‌ని ఏర్పాటు చేశామని ఈ పాఠశాలలో చదువుకునే అందరూ సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి , మేధస్సుకి ఈ రోబోటిక్ టింకరింగ్ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు ఈ ఎగ్జిబిషన్‌ని పలువురు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -రామచంద్రాపురం: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ యానాది కాలనీకి చెందిన 30కుటుంబాలు వైసిపిలో చేరాయి. శుక్రవారం సి.మల్లవరంలో దామరపాటి ప్రేమ కుమార్, మల్లారపు వాసు, మల్లారపు వెంకటరమణ, సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో తుడా ఛైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ ను పురస్కరించుకొని 60 మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫాను శుక్రవారం అందించారు. దాతలు లలితా బ్రాండ్ వెంకటేశ్వర్లు, నారాయణ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదన్నారు. తమ సంస్థ ద్వారా భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సెక్రెటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, ఇబ్రహీం, రషీద్, రసూల్, కార్యవర్గ సభ్యులు పిడి కరిముల్లా, ఎం రాధయ్య, వాచ్ షాప్ రాము, పిల్లేల శీను, పోతి రెడ్డి పెంచలయ్య, సంచి మునిప్రసాద్, నారాయణ, నాగరాజు, కృష్ణారెడ్డి, తూపిలి యశ్వంత్ పాల్గొన్నారు.

ఎక్సరే మిషన్ లేక ఇక్కట్లు..!

- మధ్యాహ్నం తర్వాత కనిపించని వైద్యులు - ఫ్రాక్చర్‌లతో వచ్చే వారికి వైద్యం కరువు - ఇదీ కోట ప్రభుత్వ ఆస్పత్రి దుస్థితి

ప్రజాశక్తి -కోట : ఎక్సరే మిషన్ లేకపోవడంతో ఫ్రాక్చర్ అయి వైద్యం కోసం వచ్చిన వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంతో మెరుగ్గా వుండేది. ప్రస్తుతం మధ్యాహ్నం తర్వాత వైద్యులు కంటికి కూడా కనిపించడంలేదు. దీనిపై పై స్థాయి అధికారులు స్పందించడంలేదు. దీంతో వైద్యం అసలు అందుతుందా? లేదా? అని ప్రజలు ఎదురు చూసి అయోమయంలో పడాల్సిన దుస్థితి కోట ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొంది..

ఫ్రాక్చర్ అయితే ఎక్సరే తీసుకునే పరిస్థితి లేదు..

రోగులకు ఏదైనా కాలు, చేయో ఫ్రాక్చర్ అయితే ఈకోట ప్రభుత ఆస్పత్రిలో తక్షణమే ఎక్సరే తీసుకునే పరిస్థితి కనిపించడంలేదు. ఇలాంటి ఎక్సరేలు తీసుకోవాలంటే బయట ఎక్సరే మిషన్ లకు వెళ్లాల్సి వస్తోంది. కోట మండలంలోని కోట ప్రభుత్వ ఆసుపత్రిని ఇటీవలే కోట్ల రూపాయలు వెచ్చించి నూతనంగా ఆసుపత్రి భవనాన్ని ఆధునికంగా నిర్మించారు. అయినా ఎలాంటి ఉపయోగం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా చిన్న ఫ్రాక్చర్ అయ్యి కోట ప్రభుత్వ ఆసుపత్రి కి వెళితే రేడియోగ్రాఫర్ (ఎక్సరే మిషన్)లేకపోవడంతో అనేక మంది పెషేంట్ లు వెనుదిరగక తప్పడం లేదని చెబుతున్నారు. దీనికి తోడు ఇంకొక విచిత్రమైన విషయం ఏమిటంటే ఆసుపత్రి లో రేడియోగ్రాఫర్ (ఎక్సరే మిషన్) లేనప్పటికి రేడియోగ్రాఫ్ మెన్ ఉద్యోగి ఉంటూ నెలకు 20 వేల రూపాయలు జీతం తీసుకుంటున్నాడు. రోజూ వస్తాడు... పోతాడు అంతే నెలకు జీతం తీసుకుంటున్నారు. అయితే ఎంతోమంది పెషేంట్ లు వచ్చి డాక్టర్ లు వద్ద చూపించుకుని ఏదో తూతూమంత్రంగా మందులు తీసుకుని వెనుదిరగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. కొంతమంది అయితే బయటకు వెళ్లి వంద రూపాయలు వెచ్చించి ఎక్సరేలు తీసుకుని వస్తున్నామని అంటున్నారు.

మధ్యాహ్నం తర్వాత కనిపించని వైద్యులు

గతంలో కోట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు ఏ సమయంలో వెళ్లినా అందుబాటులో వుండేవారు. ప్రస్తుతం మధ్యాహ్నం దాటిన తర్వాత వైద్యులు అందుబాటులో వుండడం లేదని పలువురు రోగులు వాపోతున్నారు. వైద్యులు కనిపించకపోవడంతో నిరాశతో వెనుదిరిగా రావాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నీ వసతులు ఉన్నప్పటికీ ఎక్సరే మిషన్లు లేకపోవడంతో ఎంతోమంది రోగులు ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి అత్యధికంగా డబ్బులు ఖర్చు పెట్టుకుని ఇంటికి వెళుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పై స్థాయి అధికారులు స్పందించి తక్షణమే కోట ప్రభుత్వ ఆస్పత్రిలో రేడియోగ్రాఫర్ (ఎక్సరే మిషన్) ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొనడంతో అశోక్ (35) మృతిచెందిన సంఘటన శుక్రవారం నగరి రూరల్ మండలం తడుకుపేట సమీపం చోటుచేసుకుంది. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు శ్రీకాళహస్తికి చెందిన అశోక్ కంచికి వెళ్లి ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తుండగా బస్సు తడుకుపేట సమీపం బాలాజీ భవన్ వద్ద ఆగింది. బస్సులోని వారందరూ టీ, కాఫీలకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి దిగారు. ఇలా దిగిన అశోక్ రోడ్డు దాటి అవతలివైపుకు వెళుతుండగా వేగంగా వచ్చిన తమిళనాడు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అశోక్ తీవ్రగాయాలపాలయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అశోక్ అవివాహితుడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడితోట దగ్ధం

ప్రజాశక్తి-సదుం: నిప్పు అంటుకొని సుమారుగా 6ఎకరాల మామిడి తోట మంటల్లో కాలిపోయింది. ఈ సంఘటన శుక్రవారం సదుంలో వెలుగు చూసింది. కంభంవారిపల్లి పంచాయతీ పరిధిలోని బాల్లావారిపల్లికి చెందిన మామిడి రైతులు భాస్కర, సునీత ఇచ్చిన వివరాల మేరకు.. బాల్లావారిపల్లి అటవీ ప్రాంత సరిహద్దుల్లో ఉన్న తమ మామిడి తోటకు గురువారం రాత్రి, ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మామిడి తోటకి వెళ్లి చూడగా సుమారుగా 150 మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖ ద్వారా ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

స్టేషన్‌లో లొంగిపోయిన డ్రైవర్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ద్విచక్రవాహనంలో వెళుతున్న దంపతులను ఓ గుర్తు తెలియని లారీ గురువారం రాత్రి ఢీకొంది. బైరెడ్డిపల్లి-వికోట జాతీయ రహదారిలో ఈ ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రమాదంలో దంపతులు శివ, పావనిలను తీవ్ర గాయాలైయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దంపతులిద్దరినీ ఆసుపత్రికి తరలించారు. బైక్‌ని ఢీకొని ఆపకుండా వెళ్లిపోయిన లారీ కోసం గురువారం అర్ధరాత్రికి పైగా గాలించారు. సమీపంలోని దానమయ్యగారిపల్లి టోల్‌ప్లాజా వద్ద సీసీ ఫుటేజీల ఆదారంగా ఎస్ఐ కృష్ణయ్య దర్యాప్తు చేశారు. అయితే ఆ వాహనం ఆచూకీ దొరకలేదు. పలమనేరుకు చెందిన లారీ డ్రైవర్ షాహుల్ శుక్రవారం బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. ఆ ప్రమాదానికి తానే కారకుడని ఎస్ఐకి తెలిపాడు. ఆ సమయంలో లారీ అదుపుతప్పడంతో బైక్‌ని ఢీకొందని వివరించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వైద్య విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పద్మావతి మహిళ వైద్య కళాశాలలో మూడవ సంవత్సరం అభ్యసిస్తున్న కె మోక్ష(22) ఎస్వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతాప్ అపార్టుమెంట్లో నివాసం ఉంటోం ది. అనారోగ్యంతో బాధ పడు తున్న మోక్ష ఇంటిలో నిద్రిస్తూ ఉలుకు పలుకు లేకపోవడంతో గమనించిన తల్లి 108 వాహనంలో స్విమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. అధిక మోతాదులో మందులు వేసుకోవడం వల్ల మృతి చెందినట్లు కుటుం బ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు లు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి తండ్రి బాబ్జి ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి -కోట : అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా శనివారం గుర్తించి బాటిళ్లతో పాటూ బైక్‌ను కూడా పట్టుకున్నట్లు కోట ఎస్ఐ పి నాగబాబు పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు..కోట మండలం గూడలి పంచాయతీ పరిధిలో ని ప్రకాశం కాలనీకి చెందిన తోటకూర మునిరత్నం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా తాము గుర్తించి 50 మద్యం బాటిళ్లతో పాటూ ఒక బైక్ ను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకునేందుకు కృషి చేసిన వారిలో పోలీసు సిబ్బంది కార్తీక్ ఉన్నారని పేర్కొన్నారు.

ఘర్షణ.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం : మండలంలోని నెమ్మల్లగుంటపల్లి గ్రామంలో ఇరు గ్రూపుల మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుని పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు..శుక్రవారం ఉదయం ఉదయం 6 గంటలకు కామసాని దొరమ్మ ఇంటి ముందు చెత్త ఊడ్చుతుండగా కొంత చెత్త పక్కింటి సుందరమ్మ ఇంటి ముందు పడిందని దొరమ్మను సుందరమ్మ, ధనమ్మలు ' మా ఇంటి ముందు చెత్త ఎలా పడేస్తావు?' అని నానా దుర్భాషలాడారు. దీంతో దొరమ్మ భర్త కె కొండారెడ్డి ' మీ ఇంటి ముందు పడిన చెత్తను తీసేస్తాం..'అని చెప్పినా వినకుండా సుందరమ్మ కుటుంబ సభ్యులు కొండారెడ్డి, దొరమలపై వాగ్వివాదానికి దిగారు. ఈ నేపథ్యంలో దొరమ్మ, కొండారెడ్డిలపై దాడి చేస్తుండగా కే నవీన్, రూపేష్, చిన్నక్క, ఈశ్వరమ్మలు దాడిని అడ్డుకునేందుకు వెళ్లారు. ఇంతలో సుందరమ్మ కుటుంబ సభ్యులు కే కొండారెడ్డి, కే దొరమ్మ, ఈశ్వరమ్మ, నవీన్, చిన్నక్కల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ ఘర్షణలో కొండారెడ్డి కుటుంబ సభ్యులకు పలుచోట్ల గాయాలు అయ్యాయి. వారిని వైద్యం నిమిత్తం 108 లో తిరుపతి రుయాకు తరలించారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో క్షతగాత్రులు వైద్య చికిత్సలు పొందుతున్నారు.

'అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

మాక్ డ్రిల్ ద్వారా అగ్ని ప్రమాదాలను నివారణ తీరును వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - ఓజిలి : అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా వుండాలని ఇండస్ట్రీయల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఉన్న ఏజీ అండ్ పి గ్యాస్ స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు తప్పని సరిగా ఉండాలన్నారు. పరిశ్రమలో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన లోపంతో ఆర్థిక అభివృద్ధికి శాపంగా మారుతోందన్నారు. అగ్ని ప్రమాదం జరిగితే ఏజీ అండ్‌పి సంస్థ తక్షణం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. గ్యాస్ ట్యాంకర్ టిప్పర్ ఢీ కుంటే తక్షణం తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ఆయన సెక్యూరిటీ విభాగాలకు వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్యాంబాబు, తడ రిలయన్స్ గ్యాస్ ప్రతినిధి మురుగన్, ఏజీ అండ్ పి సంస్థ ప్రతినిధులు అంబరీష్ బాబు,రీజనల్ హెడ్ గౌతమ్ ఆనంద్, డిప్యూటీ రీజినల్ హెడ్ అనీల్ కుమార్, వోఅండ్ ఎం మేనేజర్ దేవేందర్ సిరిసిల్ల, సేఫ్టీ మేనేజర్ శబరి బాబు, అసెట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వంశీ రెడ్డి, విగ్నేష్, ఓజిలి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.